క్లుప్తంగా

ఘనంగా పెన్నేరమ్మ మారెమ్మ జాతర



మోగల్లులో వేంచేసియున్న పెన్నేరమ్మ మారెమ్మ అమ్మవార్లు

పాలకోడేరు: మోగల్లులో వేంచేసియున్న పెన్నేరమ్మ మారెమ్మ అమ్మ వార్ల జాతర మహోత్సవాలు క్షత్రియ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని చలివిడి, పానకాలు కొబ్బరికాయలతో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామ పురవీధుల్లో కోయ డాన్సులు, బుట్ట బొమ్మలు, వివిధ రకాల దేవతల వేషధారణతో బాణసంచా కాల్చి అమ్మవార్లను ఊరేగించారు.

రుతుక్రమంపై అవగాహన ర్యాలీ



పైడిపర్రులో అవగాహన ర్యాలీ చేస్తున్న దృశ్యం

తణుకు: తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పైడిపర్రులో బుధవారం కిశోరబాలికలకు రుతుక్రమంపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ ఎం.అరుణకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కిశోరబాలికలు సమతుల ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఆకుకూరలు, గుడ్లు, పాలు వంటి సమతుల ఆహారాన్ని తీసుకుంటే ప్రతి నెలా సక్రమంగా రుతుక్రమం జరుగుతుందన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోరబాలికలు పాల్గొన్నారు.

విద్యార్థులుగా ఉన్నత విలువలు సాధిద్దాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యార్థినీ, విద్యార్థులు చదువులతో పాటు ఉన్నత విలువలను కూడా సాధించాలని వేసవి శిక్షణా శిబిరం రిసోర్స్‌పర్సన్‌లు పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం గ్రేడ్ -1 శాఖా గ్రంథాలయంలో బుధవారం వేసవి శిక్షణా శిబిరం గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావుచే నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎన్.సత్యం, ప్రత్తి వీరాస్వామి, వి.రామాంజనేయులు, గరికపాటి బాపయ్య శర్మ ఆధ్వర్యంలో విద్యార్థులకు కు పర్యావరణ పరిరక్షణ దినోత్సవం విశేషాలు, స్పోకెన్ ఇంగ్లీషు, జనరల్ నాలెడ్జ్, లెక్కలలో టిప్స్, పొడుపుకథలు, తదితర విషయాలను నేర్పించారు. ఆట పాటలు జరిగాయి.

కాశీ విశ్వేశ్వరుడికి రుద్రాభిషేకం



అన్నపూర్ణ, విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర స్వామిని విశేషంగా అలంకరించిన దృశ్యం

టి.నరసాపురం: టి.నరసాపురం అన్నపూర్ణ, విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో బుధవారం రుద్రాభిషేకం నిర్వహించారు. మాస శివరాత్రిని పురస్కరించుకుని ఆలయంలో కొలువైన అన్నపూర్ణ, విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర స్వామిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అమ్మవార్లకు కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

మద్ది అంజన్న ఆలయంలో పూజలు



సుప్రజకి ఆశీర్వచనాలు అందజేస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామిని బుధవారం ఆంధ్రప్రదేశ్ ఏసీబీ హెడ్ కోటర్స్ ఎస్పీ సుప్రజ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ఈవో ఆకుల కొండలరావు ఆలయ మర్యాదలతో ఎస్పీకి స్వాగతం పలికారు. స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు అనంతరం అర్చకులు, పండితులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. స్వామివారి ప్రసాదాన్ని ఎస్పీ సుప్రజకి ఈఓ అందజేశారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

సివిల్ జడ్జి అప్పలస్వామి



భీమవరం కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం



అంగన్‌వాడీ సెంటర్ వద్ద మొక్కలు నాటుతున్న దృశ్యం

భీమవరం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలని భీమవరం సివిల్ జడ్జి బి.అప్పలస్వామి అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవా సంస్థ, బార్ అసోసియేషన్ సంయుక్తంగా భీమవరం 2వ అదనపు మేజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో 2వ అదనపు సివిల్ జడ్జి డి.ధనరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మొగళ్ల వెంకట రమణారావు, పాకా రమేష్‌బాబు, న్యాయవాదులు ఉండవల్లి రమేష్‌నాయుడు, రాజారావు, విల్లింగ్‌స్టన్, ఆంద్రూస్, జయకుమార్, సుబ్బారావు, వెంకన్న, అంబేద్కర్, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

కాళ్లలో..

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని మండలం కేంద్రమైన కాళ్ల, తదితర గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల వద్ద బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి అంగన్‌వాడీ సెంటర్ నందు మొక్కలు నాటించారని, అంగన్వాడీ సూపర్వైజర్ సూర్యకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలకు పర్యావరణం గురించి అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణ అభివృద్ధికి కృషి చేయాలి

ఆకివీడు: పర్యావరణ అభివృద్ధికి విద్యార్థులు కృషి చేయాలని శాఖా గ్రంథాలయ రీడర్స్ ఫోరం అధ్యక్షులు దాసరి వెంకట సత్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక మాదివాడ శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మట్టి పాత్రలు వాడటం ద్వారా కాలుష్యాన్ని పారద్రోలి పర్యావరణాన్ని కాపాడుకోవచ్చునన్నారు. పచ్చదనం, పరిశుభ్రతతో పర్యావరణం ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధి నెల్లి సతీష్, అనిల్, గ్రంథ పాలకురాలు పార్వతి పాల్గొన్నారు.



వేసవి శిక్షణలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం



స్థానిక జెడ్పీ స్కూల్‌లో మొక్కలు నాటుతున్న దృశ్యం

జెడ్పీ హైస్కూల్‌లో...

స్థానిక పీఎల్ఎస్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం మొక్కలు నాటారు. పర్యావరణాన్ని కాపాడేందుకు మొక్కలు నాటడమే ప్రధాన లక్ష్యంగా ఉండాలన్నారు. మన భవిష్యత్ తరానికి మంచి వాతావరణం అందజేసేందుకు మొక్కల్ని విరివిగా నాటి, వాటి పెరుగుదలకు కృషి చేయాలన్నారు. కాలుష్యాన్ని తగ్గించేందుకు మొక్కల పెంపకం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతో ఆరోగ్యం పదిలం



విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయాధికారి

ఉండి: పర్యావరణాన్ని పరిరక్షిస్తేనే భవిష్యత్‌లో మన ఆరోగ్యం పదిలంగా ఉంటుందని యండగండి గ్రంథాలయ అధికారి ఎన్‌సీహెచ్ రామకృష్ణ అన్నారు. బుధవారం యండగండి శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మొక్కలు నాటించారు. అలాగే పర్యావరణ ప్రాముఖ్యతపై విద్యార్థులకు క్విజ్ పోటీ నిర్వహించారు. మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిస్తేనే మనమంతా క్షేమంగా ఉంటామన్నారు. మొక్కలు నాటడం వాటిని సంరక్షించడం ప్రతీ ఒక్కరి బాధ్యతన్నారు. బ్రైర్రాజు ఫౌండేషన్ ప్రతినిధులు కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌పై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. వివిధ పాఠశాలల నుంచి సుమారు 32 మంది విద్యార్థులు హాజరై కంప్యూటర్ విద్యను అభ్యసించారు. ఈ కార్యక్రమంలో కోఆపరేటివ్ బ్యాంక్ కార్యదర్శి సీహెచ్ రవికుమార్, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వేగేశ్న సత్యరాజ్, బ్రైర్రాజు ఫౌండేషన్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం



భీమవరం గ్రంథాలయంలో చెస్, క్యారమ్స్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

భీమవరం: పట్టణంలోని డాక్టర్ వైఎస్ఆర్ మెమోరియల్ ప్రథమ శ్రేణి శాఖాగ్రంథాలయంలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే పుస్తక పఠనం చేయించారు. ఈ సందర్భంగా దుర్గాపురం మున్సిపల్ పాఠశాల హెచ్ఎం షేక్ బాబాజీసాహెబ్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రంథాలయ పాఠకుల సంఘం అధ్యక్షుడు అరసవల్లి సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని తగ్గించాలన్నారు. అనంతరం విద్యార్థులకు ఆప్ కాస్ట్ జిల్లా సమన్వయ అధికారి మల్లుల శ్రీను, డ్యాన్స్ మాస్టర్ జె.శ్యామ్ ఆధ్వర్యంలో డ్రాయింగ్ పోటీలను నిర్వహించి చెస్, క్యారమ్స్, డ్యాన్స్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు, వి.సోమరాజు, పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయులు ఉద్యమకారులు



ఐద్వా నాయకురాలు స్వర్గీయ బొక్కా సత్యవతికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆకివీడు: ప్రజా ఉద్యమాల్లో పనిచేసే వారి మరణం చిరస్మరణీయమని పలువురు సీపీఎం నాయకులు పేర్కొన్నారు. స్థానిక జవహర్‌పేటలో సీపీఎం నాయకురాలు బొక్కా సత్యవతి మూడవ వర్ధంతి సభ నిర్వహించి, ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. డొకల లక్ష్మీ అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర ఐద్వా కమిటీ సభ్యురాలు సందక ఉదయకుమారి మాట్లాడుతూ ఉద్యమకారులు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తారన్నారు. కరోనా సమయంలో రోగులకు విస్తృత సేవలందించి, అసువులుబాసారన్నారు. ప్రజా సమస్యలపై ఆమె నిరంతరం పోరాడుతూ, అన్యాయాల్ని ఎదురించి, కార్మికులకు న్యాయం జరిగేంత వరకూ ఉద్యమించిన గొప్ప నాయకురాలని ఆమె కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు బి.సత్యనారాయణ, సీఐటీయూ మండల నాయకులు కె.తవిటినాయుడు, పెంకి అప్పారావు, గేదల విజయలావణ్య, గోపిశెట్టి రాణి, అమ్మాజీ, రవితేజ, పెంకి అప్పారావు, మహిళలు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి అండ

పాలకోడేరు: మండలంలోని విస్సాకోడేరు గ్రామానికి చెందిన మండ సోమేశ్వరరావు కుటుంబానికి అండగా ఉంటామని శృంగవృక్షం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గ్రంధి రాజా ప్రకటించారు. పేద ఆర్యవైశ్య కుటుంబంలో సోమేశ్వరరావు, లక్ష్మీ సరస్వతి దంపతులు వృద్ధులవడంతో ఏ పనీ చేయలేని స్థితిలో ఉన్నారు. వారి కుమారుడు నాని కిరాణా షాపులో పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. అయితే ఇటీవల నానీకి వెన్నుపూస ఆపరేషన్ చేయడంతో ఏ పని చేయలేని పరిస్థితుల్లో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుందని తెలిసి, సంఘ సభ్యులు సుమారు రూ.20 వేలు సేకరించామని గ్రంధి రాజా అన్నారు. ఈ నగదుతో ప్రతి నెలా కిరాణా సరుకులు ఇస్తామని తెలిపారు. ఈ మేరకు బుధవారం సంఘ సభ్యులు ఆర్యవైశ్య కుటుంబాన్ని కలసి బియ్యం, మామిడి పళ్లు, అల్పాహారం అందజేశారు. అలాగే నానికి ఉచితంగా వైద్యం చేయించి, అనంతరం ఉపాధి కల్పిస్తామని గ్రంధి రాజా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సోము రామకృష్ణ, ఉపాధ్యక్షుడు కూర్మాల పూర్ణారావు, కోశాధికారి అత్యం వాసు, కూర్మాల కాశి, యానాదిశెట్టి, అమరా కృష్ణ ప్రసాద్, సోము దుర్గాభవాని, ప్రసాద్ ఉన్నారు.

యనమదుర్రు డ్రెయిన్ అస్తవ్యస్తం



గొల్లలకోడేరు వద్ద యనమదుర్రు డ్రెయిన్‌లో నిండిపోయిన గుర్రపు డెక్క

పాలకోడేరు: గొల్లలకోడేరు వద్ద యనమదుర్రు డ్రెయిన్ గుర్రపు డెక్కతో నిండిపోయి అస్తవ్యస్తంగా కనిపిస్తుంది. కింది ప్రాంతాల వారికి సాగు నీరు అందించే ఈ డ్రెయిన్‌లో గుర్రపు డెక్క నిండిపోవడంతో నీటి ప్రవాహం స్తంభించిపోయింది. అసలు నీటి జాడలే కనిపించనంతగా గుర్రపుడెక్క పేరుకుపోయింది. వర్షాలు ఎక్కువ కురిస్తే వరద నీరు క్రిందకు పారాలంటే ఈ డ్రెయిన్ ప్రధాన పాత్ర పోషిస్తుంది. అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

శివయ్యకు విశేష అభిషేకాలు

ద్వారకాతిరుమల: క్షేత్ర పాలకుడిగా విరాజిల్లుతోన్న భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయంలో మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం శివదేవునికి విశేష అభిషేకాలు నిర్వహించారు. ముందుగా దేవస్థానం సిబ్బంది ఆలయాన్ని సుగంధభరిత పుష్పమాలికలు, మామిడి తోరణాలు, అరటి బోదెలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్చరణల నడుమ గర్భాలయంలో కొలువైన శివదేవునికి అర్చకులు, పండితులు ఏకాదశ రుద్రాభిషేకాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



పర్యావరణ దినోత్సవంలో పాల్గొన్న సంస్థ ప్రతినిధులు

తణుకు: ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని తణుకు ఆంధ్రా సుగర్స్ సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం స్థానిక పరిశ్రమ ఆవరణలో చేపట్టిన ఈ కార్యక్రమంలో పరిశ్రమ అడిషనల్ సెక్రటరీ పి.వి.ఎస్.విశ్వనాథ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని వారి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. తద్వారా వాతావరణ కాలుష్యాన్ని తగ్గించి భూసరంక్షణ చేసుకోవాలని భావితరాలకు కాలుష్య రహిత పర్యావరణాన్ని అందజేయాలన్నారు. సంస్థ టెక్నికల్ అడ్వైజర్ గుళ్లపల్లి రంగారావు మాట్లాడుతూ పరిశ్రమల నుంచి ఘన, ద్రవ, వాయువు రూపంలో వెలువడే వ్యర్థాలను వాటి యొక్క స్వభావం మేరకు శుద్ధి చేయడం ద్వారా పర్యావరణానికి ఎటువంటి హాని కలుగకుండా చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ సందర్భంగా పరిశ్రమలో వివిధ రకాల సాంకేతిక వ్యవస్థల ద్వారా పరిశ్రమ నుంచి వెలువడే వ్యర్థాలను శుద్ధిచేసి పర్యావరణ సమతుల్యాన్ని పరిరక్షిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మానవ వనరుల విభాగం జనరల్ మేనేజర్ ఎ.సాంబశివరావు, చీఫ్ కెమిస్ట్ బి.శ్రీనివాసరావు, ఎన్విరాన్మెంట్ విభాగం అధిపతి జి.బాబురావు, జి.ధనుంజయ, ఇతర ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఆకివీడు: మండలంలోని అజ్జమూరు గ్రామ శివారు ప్రాంతంలో పేకాట స్థావరంపై పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. దాడిలో నలుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.2,800 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి, నిందితులను కోర్టులో హాజరు పరుస్తామని ఎస్సై తెలిపారు.

నేటి వరకూ 144 సెక్షన్

ఆకివీడు: ఎన్నికల నేపథ్యంలో విధించిన 144 సెక్షన్ గురువారం సాయంత్రం వరకూ అమలులో ఉంటుందని నగర పంచాయతీ కమిషనర్ జీ.కృష్ణమోహన్ తెలిపారు. కౌంటింగ్ అనంతరం విజేతలను ప్రకటించారు. దీంతో ఈ విషయంపై ప్రదర్శనలు నిర్వహించకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా 144 సెక్షన్ అమలులో ఉందని, నేటితో ముగుస్తుందన్నారు.

లక్కవరంలో అంగన్‌వాడీ బాట



లక్కవరంలో ర్యాలీ నిర్వహించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది బుధవారం అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో చిన్నారులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సెక్టార్ సూపర్ వైజర్ మాదాసు విజయ మాట్లాడుతూ మూడు నుంచి ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని గర్భిణీలు, బాలింతలు తీసుకుంటూ ఆరోగ్యంగా జీవించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వినాయక స్వామి ఆలయంలో అన్నసమారాధన

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో బుధవారం అన్నసమారాధన నిర్వహించారు. తొలుత స్వామి వారికి నైవేద్యంగా చక్కెర పొంగలి, పులిహోర, రెండు రకాల కూరలు, సాంబారు, పెరుగు, అన్న ప్రసాదం సమర్పించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ నిర్వహించారు. సుమారు 1,100 మంది అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయంలో ప్రతి నెలా మొదటి బుధవారం అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కొమ్మసాని రవీందర్ రెడ్డి, చల్లా వరప్రసాద్, కల్లూరి మురళీకృష్ణ, శ్రీనివాస వెంకట గంగాధర్ పాల్గొన్నారు.

నైపుణ్యాల నెలవు.. వృత్తివిద్యా కోర్సులు

ఆఫీస్ అసిస్టెంట్ షిప్ (ఓఏఎస్) కోర్సుపై విద్యార్థుల ఆసక్తి



పెంటపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల



డీఆర్ గోయంకా ప్రభుత్వ జూనియర్ కళాశాల

పెంటపాడు: ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలలో ఒక ఉద్యోగికి ఉండాల్సిన నైపుణ్యాలను వృత్తివిద్యా కోర్సు ద్వారా ఆఫీస్ అసిస్టెంట్ షిప్ (ఓఏఎస్) ఎంతో నేర్పిస్తుంది. పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఈసీఈ, హెచ్ఈసీలతోపాటు పదో తరగతి పాసైన విద్యార్థులకు మరో కోర్సు వరంలా పరిణమించింది. ఈ ప్రభుత్వ కళాశాలలో ప్రధానంగా ఆఫీస్ అసిస్టెంట్ షిప్ (ఓఏఎస్) కోర్సు విజయవంతంగా నడుస్తోంది. ప్రతీ సంవత్సరం ఎంతో మంది విద్యార్థులు 2 సంవత్సరాల కోర్సైన ఓఏఎస్‌ను చదివి ప్రభుత్వ, ప్రైవేటు సెక్టార్లలో మంచి జీతంతో రాణిస్తున్నారు.

కోర్స్ వివరాలు..

పదోతరగతి తరువాత ప్రతి విద్యార్థి ఇంటర్ మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ తదితర కోర్సులు చదవాలని, అనంతరం ఇంజనీరింగ్, డిగ్రీ కోర్సులు చేయానుకొంటారు. అధిక శాతం మంది విద్యార్థులు ఈ మార్గంలోనే వెళుతుంటారు. ఆ కోర్సులలో ప్రవేశం పొందాలని ఉన్నా, ఆర్థికస్తోమత, కుటుంబ నేపథ్యం వంటి కారణాలతో సతమతమవుతుంటారు. ఇలాంటి పేద విద్యార్థుల కోసం ఇంటర్‌లో రెండు సంవత్సరాల వృత్తివిద్యా కోర్సులు ప్రవేశపెట్టారు. వీటిలో ప్రధానంగా ఆఫీస్ అసిస్టెంట్ షిప్ (ఓఏఎస్), లాబ్ టెక్నిషియన్, మొదలైనవి ఉన్నాయి. అయితే ప్రధానంగా ఓఏఎస్ కోర్సుకు తీవ్ర డిమాండ్ ఉంది. సమాజంలో ఉద్యోగికి ఉండాల్సిన నైపుణ్యాలను పెంపొందించేందుకు వీలుగా ఈ కోర్సు పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేశారు. ఈ కోర్సులలో ఇంగ్లీషు, జనరల్ ఫౌండేషన్ కోర్సు, బిజినెస్ ఆర్గనైజేషన్, టైపు రైటింగ్, అకౌంటెన్సీ, కంప్యూటర్, షార్ట్‌హేండ్, టాలీ, తదితర సబ్జెక్టులు బోధిస్తారు. వీటివల్ల తక్కువ సమయంలో విద్యార్థులు స్థిరపడే అవకాశం ఉంది. ఆఫీసు సహాయకులు, స్టెనోగ్రాఫర్, అకౌంట్స్ అసిస్టెంట్, టైపిస్ట్, కాపియిస్ట్, కంప్యూటర్ ఆపరేటర్, పర్సనల్ అసిస్టెంట్, ప్రేవేట్ కార్యదర్శి, రిసెప్షనిస్ట్, కోర్టు మాస్టర్ ఉద్యోగాలు ఈ కోర్సుతో లభిస్తాయి. కోర్సు పాసైన వారు బీఏ, బీకాం, బీబీఎం కోర్సులలో చేరేందుకు అర్హులు. ఈ కోర్సులో చేరే విద్యార్థులు వివరాలకు కె.శ్రీనివాసరావు, సెల్ నెంబర్: 94413 91791 సంప్రదించాలన్నారు.

రెండు ఉద్యోగాలు సాధించగలిగాను



నేను పెంటపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓఎస్ఏ కోర్సు పూర్తి చేశాను. ఈ కోర్సు చదవడం వల్ల ఎంతో ఉపయోగం ఉంటుంది. షార్ట్‌హేండ్‌లోనూ, హైస్పీడ్ టైపులోనూ సర్టిఫికేట్స్ సంపాధించాను. ఏపీ, తెలంగాణ హైకోర్టులలో ఏక కాలంలో ఉద్యోగాలు సాధించగలిగాను.

– గోకా దేవి నాగసాయి ప్రియాంక, స్టెనోగ్రాఫర్ గ్రేడ్ -3, ఇబ్రహీంపట్నం కోర్టు, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ

ఇంటర్‌తోనే ఉద్యోగం వచ్చింది



నేను, మా తమ్ముడు ఈ కోర్సు చేయడం వల్ల కోర్టులో స్టెనోగ్రాఫర్లుగా స్థిరపడ్డాం. ఇంటర్ అర్హతతోనే ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనుకొనే వారికి ఈ ఓఏఎస్ కోర్సు ఎంతగానో ఉపయోగపడుతుంది.

-వై.వీర్రాజు, స్టెనో గ్రాఫర్ జ్యూడీషియల్ డిపార్ట్‌మెంట్, తణుకు